


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 15-08-2023 సంపుటి : 04 సంచిక : 304 పేజీలు : 8 వెల : రూ 3-00

# పంద్రాగస్ట్ వేడుకలకు ఎర్రకోట సిద్ధం

**జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్న ప్రధాని**

**భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు**

**పదివేలమందితో ప్రత్యేకంగా బందోబస్త్**

**తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురికి ఆహ్వానం**

న్యూఢిల్లీ,ఆగస్ట్14 పంద్రాగస్టు వేడుకలకు దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట ముస్తాబ య్యింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేసారు. ఎనర్రకోట వేదికగా ప్రధాని మోడీ జాతికి సందేశం ఇవ్వనున్నారు. ఇందుకు అనుగుణంగా పటిష్ట ఏర్పాట్లు చేశారు. స్వాతంత్ర్య దిన వేడుకలకు ఎర్రకోట అందంగా ముస్తాబయ్యింది. రకరకాల పూలతో ఆ ప్రాంతాన్ని సుందరంగా అలంకరి ంచారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలకు 10 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా 1000 సీసీ కెమెరాల తో నిఘా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచి అనుమానితులు ప్రతి ఒక్కరి కదలిక లను క్షుణ్ణంగా గమనిస్తున్నారు. ఈ ఏడాది 20 వేలకు పైగా అధికారులు, పౌరులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. రాజ్‌ఘాట్, ఐటీవో, రెడ్ ఫోర్ట్‌తో పాటు ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. ఇదిలావుంటే ఈ వేడుకలకు



కేంద్ర ప్రభుత్వం 1800 మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించింది. పీఎం-కిసాన్ పథకం లబ్దిదారులు సహా మొత్తం 1800 మంది ప్రత్యేక అతిథులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. దేశంలోని పలు రంగాలకు చెందిన వారిని కేంద్రం ప్రత్యేకంగా ఆహ్వానిం చింది. సర్పంచులు, ఉపాధ్యాయులు, నర్సులు, రైతులు, మత్స్యకారులు, కార్మికులు, ఖాదీరంగ శ్రామికులు సహా అనే రంగాలవారిని ఆహ్వానించామని కేంద్ర వ్యవసాయ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

# అర్జీదారులకు ఎండార్స్మెంట్ తప్పనిసరిగా అందజేసేలా చర్యలు చేపట్టండి...

## జిల్లా కలెక్టర్ డాక్టరు జి.సృజన

కర్నూలు కలెక్టరేట్ :జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక "జగనన్నకు చెబుదాం-స్పందన" కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన,జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య లతో కలిసి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో ఎక్కువ శాతం స్పందన అర్జీలకు సంబంధించిన ఎండార్స్మెంట్లను కేవలం వారి మొబైల్ ఫోన్లకు సదరు సమస్య పరిష్కారం అయిందన్న విషయాన్ని తెలియజేస్తున్నారని అలా కాకుండా జిల్లా/మండల స్థాయి అధికారులు అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంటును వారి కార్యాలయల వద్దకు పిలిపించి వారి చేతికి ఎండార్స్మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా/మండల స్థాయి అధికారులను ఆదేశించారు.దీని వల్ల అర్జీదారులలో సంతృప్తి స్థాయి పెరిగే అవకాశం ఉంటుందన్నారు.అందుకు తగిన ఆదేశాల కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.అదే విధంగా అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు....క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు.అర్జీదారుడు



సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు.పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా వచ్చిన దరఖాస్తులు మళ్లీ రీఓపెనింగ్.. కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక "జగనన్నకు చెబుదాం - స్పందన" కార్యక్రమంలో కొన్ని వినతులు... మంత్రాలయం మండలం,మాధవరం గ్రామ నివాసి హరిజన చిన్న తిమన్న నాకు సర్వే నెంబర్ 12/2,12/5,లలో ఒక్క ఎకరాల 6సెంట్లు భూమి కలదు. నా భూమిని ఆన్ లైన్ లో నమోదు చేయించాలని కోరుతూ అర్జి సమర్పించారు.కల్లూరు మండల కేంద్ర నివాసి పి.పెద్దిరెడ్డి నాకు కోడుమూరు మండలంలోని బైన్ దొడ్డి గ్రామ పొలిమేర లో సర్వే నెంబర్ 741/1 లో 66సెంట్ల భూమి కలదు.నా భూమిని అదే గ్రామంలోని కొంతమంది ఆక్రమించుకున్నారు అని అర్జీ ఇచ్చారు.నందవరం మండలం,మాచాపురం గ్రామ నివాసి డి.హనుమంతు రెడ్డి,నాకు మాచాపురం గ్రామ పొలిమేరలో సర్వే నెంబర్ 99౦-2పైకి ఒక్క 1.32ఎకరాలు భూమి కలదు.నా భూమిని అన్ లైన్ లో 0.41సెంట్లు మాత్రమే నమోదు చేశారు. మిగులు భూమిని కూడా నమోదు చేయించాలని కోరారు.కర్నూలు మండలం,ఈ.తాండ్రపాడు గ్రామ నివాసి కే.మహాదేవుడు,నాకు సర్వే నెంబర్ 47 లో 1.85ఎకరాలు భూమి కలదు.నా భూమి రిజిస్టర్ ఆఫీస్ నందు సీలింగ్ భూమిగా గుర్తించామన్నారు.కావున సీలింగ్ భూమి జాబితా నుండి తొలగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య,డిఆర్ఓ నాగేశ్వరరావు,జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి,సిపిఓ అప్పలకొండ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ,నాగప్రసన్న, లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# త్రివర్ణం - -- సగర్వం



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 14 విభారె న్యూస్ : దేశం మనదే.. తేజం మనదే.. ఎగురుతున్న జెండా మనదే.. దేశం తర్వాతే ఏదైనా అని, ప్రతి ఒక్కరూ జాతీయ భావానికి విలువ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం, పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 100 అడుగుల జాతీయ జెండాతో నంద్యాల మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ సెంటర్ వరకు భారీ ర్యాలీ చేశారు. జాతీయ జెండా ప్రతి ఒక్క ఇంటిపై రెపరెప లాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఆగస్టు15 వ తేదీన మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా వందనం ఉంటుందని కావున ప్రజాప్రతినిధులు. అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఛైర్ పర్సన్ మాబున్నిసా. కమిషనర్ రవి చంద్రా రెడ్డి. . అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. ఎమ్ ఈఈ. టౌన్ ప్లానింగ్ అధికారులు.. డీఈలు హెల్త్ ఆఫీసర్. శానిటేషన్ సూపరైజర్ . కౌన్సిలర్లు. మున్సిపల్ సిబ్బంది విద్యా శాఖ అధికారులు. మాజి కౌన్సిలర్లు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

# కరోనాకు వ్యాక్సిన్ దొరికింది.. జగనోరాకి మందు దొరకలేదు: లోకేశ్ ఎద్దేవా



2 కొత్త పార్లమెంటును నిర్మించిన కూలీలు, జాతీయ అవార్డు (మిగతా 8లో )

# పుట్టాలమ్మను దర్శించుకున్న గంగుల దంపతులు



ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ : మండలంలోని ఆర్ కృష్ణాపురం సమీపంలో ఉన్న శ్రీ రామ తీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి దంపతులు సోమవారం దర్శించుకుని పూజలు చేశారు. వారి రాక సందర్భంగా ఆలయ ఈవో సాయి జయచంద్ర రెడ్డి, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువుదీరిన పుట్టాలమ్మ అమ్మవారిని, కొండపైన వెలిసిన శ్రీ యోగానంద నరసింహ స్వామిని, లక్ష్మీదేవి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేదమంత్రాలతో వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వాడు వెంట వైకాపా నాయకులు గంగుల రామిరెడ్డి, ఆర్ కృష్ణాపురం వైకాపా నాయకులు ఉన్నారు.

# కలియుగంలో అవతరించిన దైవం శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి.

కౌతాళం ఆగస్ట 14 విభారె న్యూస్:-కలియుగంలో మానవ అవతారంగా ఉరుకుంద ప్రాంతంలో నడిగాడి అక్కడే అశ్వత్థ వృక్షం క్రింద తపస్సు గావించే నమ్మిన వారికోరికలు నెరవేర్చి కలియుగ దైవంగా అవతరించారని భక్తులు విశ్వసిస్తున్నారు. అన్ని మతాలవారు సైతం స్వామిని కొలవడం విశేషం. శైవ భక్తులు వీరభద్ర స్వామిగా , వైష్ణవ భక్తులు నరసింహునిగా స్వామిని నమ్ముతారు. ఆ నమ్మకంతోనే ఏటేటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో నెలరోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. ఈనెల 17న సాయంత్రం నాలుగు గంటల నుండి గో, గణపతి పూజలతో కార్యక్రమం ప్రారంభమవుతాయి. అనంతరం ఆలయ శుద్ధి, స్వస్తి, పుణ్య వచనం, ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతాయి. 17న ప్రారంభమైన ఉత్సవాలు సెప్టెంబర్ 14 వరకు జరుగుతాయి. సెప్టెంబర్ 11న స్వామి వారి ఉత్సవ మూర్తిని కోసిగి మండలంలోని కందుకూరు గ్రామం వద్ద తుంగభద్ర నదీ తీరానికి ఆలయ సిబ్బంది, భక్తులు పాదయాత్రగా వెళ్లి ఉత్సవమూర్తులకు స్నానాలు నిర్వహిస్తారు. తిరుగు ప్రయాణంలో



వివిధ గ్రామాల ప్రజలు ఉత్సవమూర్తులకు పూజలు చేస్తారు. ఉత్సవమూర్తులు ఉరుకుంద గ్రామం చేరుకోగానే అక్కడ ఉన్న భక్తులు జయ, జయ ధ్వనాలతో స్వాగతం పలుకుతూఆలయానికి చేరుకుంటారు. నెలరోజుల పాటు జరిగే ఉత్సవాలకు లక్షలాది భక్తులు ఉరుకుందకు వచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులు ఆర్టీసీ, ప్రైవేట్, వాహనాల ద్వారానే కాక కాలినడకన ఉరుకుంద గ్రామానికి చేరుకోవడం విశేషం. భక్తులకు సౌకర్యం కల్పిస్తాం.... ఈవో వాణి. రోజు వచ్చే భక్తులకు సౌకర్యం కల్పిస్తాం. మహిళా భక్తులకు స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశాము. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఆయా ఆర్టీసీ డిపో అధికారులతో మాట్లాడి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయించాం. గ్రామ చివరన బస్టాపులకు స్థలం కేటాయించాం. ముఖ్యంగా తాగునీరు పారిశుధ్యం ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా చూస్తాం.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 14 విభారె న్యూస్ :-నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఏర్పాట్లను సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమున్ పరిశీలించారు. జాతీయ పతాక ఆవిష్కరణ మొదలుకొని కార్యక్రమ ఆద్యంతం వరకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. వేదిక బ్యాక్ డ్రాప్, పోలీస్ సాయిధ దళాల మార్చ్ ఫాస్ట్, సీటింగ్ అరేంజ్మెంట్, పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. డి ఆర్ డి ఏ, డ్వామా, ఎస్సీ కార్పొరేషన్, హౌసింగ్ , వ్యవసాయం స్త్రీసంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం, ఉద్యానం, రవాణా, సూక్ష్మ సేద్యం, సివిల్ సప్లైస్, అగ్నిమాపక తదితర శకటాలను ప్రదర్శించనున్నారు. అలాగే సంబంధిత శాఖలన్నీ కూడా తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై చేస్తున్న ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తో పాటు డిఆర్వో పుల్లయ్య, ఏఎస్పి వెంకట్రాముడు, సంబంధిత అధికారులు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టరుకు వివరించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి సాయి దళాల మార్చ్ ఫాస్ట్ ను పరిశీలించే నిమిత్తం ఏర్పాటు చేసిన పరిశీలన వాహనాన్ని కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ వెంకటరమణ ,డిఎస్పి మహేశ్వర్ రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట వున్నారు.

# సంపాదకీయం

మంగళవారం 15-08-2023

## శతాబ్దాల పోరాటం, త్యాగం, అచంచలమైన సంకల్పం

పంద్రాగస్టు.. భారత దేశం పరాయి పాలననుంచి స్వాతంత్ర్యం పొందిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకునే రోజు.. 1947లో బ్రిటీష్ వలస పాలన నుంచి భారతదేశం విముక్తి పొందిన తర్వాత ప్రతి సంవత్సరం ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ మహత్తర సందర్భం శతాబ్దాల పోరాటం, త్యాగం, అచంచలమైన సంకల్పానికి ముగింపు పలికింది. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయుల అలుపెరగని పోరాటం, ప్రాణత్యాగం ఫలితంగా స్వాతంత్రం సిద్ధించిన రోజును మనం పండుగలా జరుపుకుంటున్నాం.దేశం సాధించిన విజయాలను ప్రతిబింబిస్తూ.. నిరంతర ప్రగతి ఆవశ్యకతను నొక్కి తెలియజేస్తారు. స్వాతంత్ర్య దినోత్సవం అనేది గతానికి సంబంధించిన వేడుక మాత్రమే కాదు.. దేశం ఉజ్వల భవిష్యత్తు కోసం ఎదురుచూసే అవకాశం.. ఇది భారత దేశానికి ఆధారమైన భిన్నత్వంలో ఏకత్వం, ప్రజాస్వామ్య విలువలను గుర్తు చేస్తుంది.స్వాతంత్ర్య దినోత్సవం యొక్క థీమ్ నేషన్ ఫస్ట్.. ఆల్వేస్ ఫస్ట్.. ఈ థీమ్ కష్ట సమయాల్లో కూడా దేశ ప్రయోజనాలకు మొదటి స్థానం ఇవ్వాలనే ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందని ప్రభుత్వం తెలిపింది.పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంతో ఈ రోజు ప్రారంభమవుతుంది.. ఆ తర్వాత దేశభక్తి గీతాలు పాడటం, సాంస్కృతిక ప్రదర్శనలు జాతీయ భావం నింపుతాయి. ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట నుండి దేశాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తారు. రోజంతా భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు, కవాతులు జరుగుతాయి. ప్రజలంతా జెండా పండుగలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పిస్తారు. దేశం పట్ల తమకున్న ప్రేమను చాటుకుంటారు. అంతేకాదు.. దేశ ప్రగతి, ముందున్న సవాళ్లను ప్రజలు అంచనా వేసేందుకు ఈ రోజు ఒక సమయంగా ఉపయోగపడుతుంది. రాబోయే తరాలకు బలమైన, సమగ్రమైన, సంపన్నమైన దేశాన్ని నిర్మించాలనే నిబద్ధతను పునరుద్ధరించేందుకు స్వాతంత్ర్య దినోత్సవం ఓ మంచిరోజు. 76వ స్వాతంత్ర్య దినోత్సవం: బ్రిటీష్ పాలన నుంచి దేశం స్వాతంత్ర్యం పొందిన ఒక సంవత్సరం తర్వాత భారతదేశం మొదటి స్వాతంత్ర్య దినోత్సవాన్ని 1948 ఆగస్టు 15న జరుపుకున్న వాస్తవం ఆధారంగా 76వ స్వాతంత్ర్య దినోత్సవంగా పరిగణించబడుతుంది. ఇది చాలా సాధారణమైన గణన పద్ధతి. భారతదేశం 15 ఆగస్టు 1947న స్వాతంత్ర్యం లభించిందనే వాస్తవం ఆధారంగా ఈ లెక్కింపు విధానం రూపిందించబడంది. కాబట్టి 2023 అనేది 77వ స్వాతంత్ర్య దినోత్సవం. అయితే ఎక్కువగా 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్నే పరిగణనలోని తీసుకుంటున్నారు. మరో వైపుఆగస్టు 15 వస్తోందనగానే చాలా చోట్ల జాతీయ జెండా రంగుల్లో దుస్తులు అమ్ముతున్నారు. చాలామంది ఇష్టంగా కొనుక్కుని ధరించి దేశభక్తిని చాటుకుంటారు. ఇలా జాతీయ జెండా రంగుల్లో దుస్తులు ధరించడంలో తప్పు లేదు. అయితే దానికి సంబంధించిన కొన్ని నియమాలు మాత్రం పాటించాలి. దీనికి సంబంధించి 2005లో లోక్‌సభ ఒక బిల్లును ఆమోదించింది. భారతీయ పౌరులు గౌరవప్రదంగా ధరిస్తే వారి దుస్తులలో భాగంగా త్రివర్ణాన్ని ధరించవచ్చును అని పేర్కొంది. అయితే 2005లోని సెక్షన్ 2 (ఇ) ప్రకారం జాతీయ జెండాను ఎవరూ నడుము కింద్రి నుంచే ధరించే దుస్తుల్లో వాడరాదు. జాతీయ జెండాను ఎలాంటి డ్రెస్ మెటీరియల్ పైన ముద్రించకూడదు అని స్పష్టం చేసింది.చట్టం ప్రకారం నడుము క్రింద భాగంలో ఎవరూ త్రివర్ణ పతాకాన్ని ధరించకూడదు. కుషన్లు, రుమాలు మరియు లో దుస్తులు వంటి రోజువారి ఉపయోగంలో వాడరాదు.

## దేవరాయపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



ఆళ్లగడ్డ ప్రతినిది ఆగస్టు 14 విభారె న్యూస్ : ఆళ్లగడ్డ మున్సిపాలిటీ 2వ సచివాలయం పరిధిలోని 26,27 వ వార్డు దేవరాయపురంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల నాని గ్రామంలోని తూర్పు వీధి,మంగలి వీధి,చాకలి వీధి,ఎస్సీ కాలనీలలో పర్యటించి ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను 97% నెరవేర్చాలని, అలాగే సంక్షేమం అభివృద్ధి జగన్మోహన్ రెడ్డి కే సాధ్యమని ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అందజేసింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, ఆళ్లగడ్డ టౌన్ వైఎస్ఆర్సీపీ కన్వీనర్ గౌట్లూరు సుధాకర్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు సింగం వెంకటేశ్వర రెడ్డి, ఆళ్ళగడ్డ మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోపవరం నర్సింహా రెడ్డి,చింతకుంట వైఎస్సార్సీపీ నాయకులు, కౌన్సిలర్ వరప్రసాద్ రెడ్డి,వైఎస్సార్సీపీ నాయకులు శంకర్ రెడ్డి,లోకేశ్వర రెడ్డి,మల్లిఖార్జున రెడ్డి ,ఇంజేటీ నాగిరెడ్డి,శివ నాగిరెడ్డి ,చంద్రా రెడ్డి,సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## కరోనాకు వ్యాక్సిన్ దొరికింది.. జగనోరాకి మందు దొరకలేదు: లోకేశ్ ఎద్దేవా



తాడికొండ: 2019 తర్వాత రాష్ట్రానికి రెండు వైరస్‌లు వచ్చాయని.. ఒకటి కరోనా, రెండోది జగనోరా అని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు.కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ దొరికిందని.. జగనోరాకు ఇంకా మందు దొరకలేదని వ్యాఖ్యానించారు. 'యువగళం' పాదయాత్రలో భాగంగా తాడికొండలో ఆడిటర్లతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటర్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.సీఐడీ ద్వారా ప్రభుత్వ వేధింపులను ఆడిటర్లు నారా లోకేశ్ దృష్టికి ఆడిటర్లు తీసుకెళ్లారు. చార్టెడ్ అకౌంటెంట్లపై సీఐడీ ద్వారా ప్రభుత్వం కేసులు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడిటర్లు, చార్టెడ్ అకౌంటెంట్లకు సంబంధం లేని వ్యవహారాల్లో కేసులు పెట్టారని.. రాజకీయ కక్షలతో అరెస్టులు చేశారని లోకేశ్‌కు తెలిపారు. అరెస్టుల విషయంలో కనీస నిబంధనలు పాటించలేదని ఆరోపించారు.అనంతరం లోకేశ్ మాట్లాడుతూ రాజకీయాలు, వృత్తి వేర్వేరని.. కానీ వైకాపా ప్రభుత్వం ప్రతి దాన్నీ రాజకీయంగానే చూస్తోందన్నారు. మార్గదర్శిపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధిస్తోందని విమర్శించారు. "రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే చాలా బాధగా ఉంది. జగన్ సీఎం కాగానే ప్రజావేదిక కూల్చడంతోనే విధ్వంసం మొదలుపెట్టారు. అమరావతిని నాశనం చేశారు. కంపెనీలు పొరుగు రాష్ట్రాలకు తరలి వెళ్తున్నాయి. ఆడిటర్లకు రాష్ట్రంలో పనిలేకుండా పోయింది. ఒకే ఒక్క వ్యక్తి వల్ల రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది నష్టపోయారు. అమరరాజా వంటి కంపెనీలను బయటకు గెంటారు. కులం అంటగట్టి మరీ పారిశ్రామికవేత్తలను వేధించారు .రానున్న ఎన్నికల్లో తెదేపా అధికారంలోకి రావడం ఖాయం. అభివృద్ధితో పాటు సంక్షేమం మా విధా నం. అభివృద్ధి చక్రాల ఆధారంగా సంక్షేమం బండి నడవాలి. తెదేపా హయాంలో 120 సంక్షేమ కార్యక్ర మాలు అమలు చేశాం. అప్పులు చేసి సంక్షేమం విఫలమైన విధానం. తెదేపా అధికారంలోకి వచ్చాక ఈజ్ ఆఫ్ డూయింగ్‌తో పాటు కాస్ట్ ఆఫ్ డూయింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటాం" అని లోకేశ్ చెప్పారు.

## కాంగ్రెస్ లో బీసీ నేతల అసంతృప్తి

హైదరాబాద్, ఆగస్టు 14, (న్యూస్ పల్స్) తెలంగాణ కాంగ్రెస్‌లో జిల్లా అధ్యక్షులుగా ఓసీలే ఎక్కువ మంది ఉన్నారని.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సరైన ప్రాధాన్యత లభించడంలేదంటూ కొందరు బీసీ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్టీలోనే ఉన్న సినీయర్ బీసీ నేతలను కాదని, కొత్తగా వచ్చినవారికి పదవులు లభిస్తున్నాయని ఆసమ్మతి తెలిజేస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రస్తుతం జిల్లా అధ్యక్షుల జాబితాను ఓ సారి పరిశీలిస్తే.. ఓసీలు 22, బీసీలు 6, ఎస్సీలు 3, ఎస్టీలు 2, మైనార్టీల తరఫున ఇద్దరు ఉన్నారు. బీసీ నాయకులకు 6 జిల్లాలను మాత్రమే ఇచ్చిన కాంగ్రెస్ సామాజిక న్యాయాన్ని ఎలా చేస్తుందనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. అటు 22 మంది ఓసీ నాయకుల్లో కూడా 15 జిల్లాల అధ్యక్షులు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కాగా.. వెలమ 4, వైశ్య, ఠాకూర్, కమ్మ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరే ఉన్నారు. జిల్లా అధ్యక్షుల లెక్కలు ఇలా ఉన్న నేపథ్యంలో.. అందరిని కలుపుకొని పోవాలని చెప్పిన కాంగ్రెస్ అధిష్టానం మాటలను రాష్ట్ర నాయకత్వం పట్టించుకోవడం లేదా? లేదా అధిష్ఠానాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారా? అనే అనుమానాన్ని కొందరు బీసీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.తాజాగా రాష్ట్రంలోని మూడు జిల్లాలకు డీసీసీ అధ్యక్షుల నియామకం జరిగిన విషయం తెలిసిందే. వీరిలో నిర్మల్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన శ్రీహరి రావు.. మహేశ్వర్ రెడ్డి హస్తం పార్టీ నుండి వెళ్లిపోయాకా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కానీ పీసీసీ చీఫ్ రేవంత్ మాత్రం కాంగ్రెస్‌లో సీనియర్ నేతలు వీళ్ళు అంటూ రికమండేషన్ చేయడంపై కూడా సీనియర్ బీసీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జనగామ డీసీసీ విషయంలో.. పొన్నాల లక్ష్మయ్య కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మొదటి నుంచి కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని వ్యతిరేకించే పొన్నాల.. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రతాప్ రెడ్డిని కోమటిరెడ్డి వెంకటరెడ్డి సిఫార్స్ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఢిల్లీ పెద్దలకు కూడా ఫిర్యాదు చేశారు పొన్నాల. బీసీ నేత పొన్నాలకి చెక్ పెట్టడానికే.. కొమ్మూరిని తెచ్చి పెట్టారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పీసీసీ చీఫ్‌గా పని చేసిన పొన్నాల విషయంలోనే ఇలా ఉంటే.. మిగిలిన చోట పరిస్థితి ఏంటన్న వాదన లేకపోలేదు.ఇక ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీకి.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కో చైర్మన్‌ని చేసి ఆయన్ను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఉద్యమ కారుడు పొన్నం ప్రభాకర్‌కి ఇప్పటి వరకు పదవి లేదని, ఆయన తర్వాత పార్టీలోకి వచ్చిన ఓసీ నేతలకు మాత్రం పదవులు ఇస్తున్నారని కొందరు బీసీ నేతలు వాపోతున్నారు. పార్టీ పదవుల్లోనే సామాజిక న్యాయం లేదు, సీనియర్ నేతలకే చెక్ పెట్టె పనిలో ఉన్నారనే ఫిలింగ్ కొందరు బీసీ నేతల్లో ఉంది. భువనగిరి కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ రెడ్డి పార్టీలో సీనియర్ లీడర్ కావడంతో ఆయన విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేనప్పటికీ.. మిగిలిన ఇద్దరూ పార్టీలో జూనియర్స్ అని, వారి కంటే సినీయర్ బీసీ నేతలు ఉన్నారని కొందరి వాదన. ఇలా తెలంగాణ కాంగ్రెస్‌లో బీసీ నాయకుల సంతృప్తి, కొత్తవారికే ప్రాధాన్యతనిస్తున్నారని అసమ్మతి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న వేళ పార్టీ నాయకత్వం వెంటనే ఈ సమస్యలపై దృష్టి సారించాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## వాట్సప్ అకౌంట్ నుంచి మరిన్ని అకౌంట్లు

హైదరాబాద్, ఆగస్టు 14, (న్యూస్ పల్స్)వాట్సాప్ ప్రస్తుతం మల్టీపుల్ అకౌంట్ లాగిన్ ఫీచర్‌పై పని చేస్తోంది. ఈ ఫీచర్ కింద మీరు ఒకే యాప్‌లో ఒకటి కంటే ఎక్కువ ఖాతాలను ఉపయోగించగలరు. ఒక అకౌంట్ నుంచి మరో అకౌంట్‌కు వెళ్లడానికి మీరు స్విచ్ చేసుకుంటే సరిపోతుంది. ఈ రకమైన ఫీచర్‌ను ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్‌లో మెటా అందించింది.మల్టీపుల్ అకౌంట్ లాగిన్ ఫీచర్ పరిచయంతో మీరు ఫోన్‌లో ప్యారలల్ స్పేస్, డ్యూయల్ యాప్స్ వంటి యాప్స్‌ను ఉంచాల్సిన అవసరం లేదు. ఈ అప్‌డేట్ గురించిన సమాచారాన్ని వాట్సాప్ డెవలప్‌మెంట్‌ను పరిశీలించే వెబ్‌సైట్ చిజీఎవబిజీతినిటనీ షేర్ చేసింది.ప్రస్తుతం ఈ ఫీచర్‌ను కొన్ని బీటా టెస్టర్ల కోసం విడుదల చేశారు. రాబోయే కాలంలో కంపెనీ దీన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురానుంది. మీరు కూడా ముందుగా వాట్సాప్‌కు సంబంధించిన అన్ని కొత్త ఫీచర్లను పొందాలనుకుంటే, దీని కోసం మీరు కంపెనీ బీటా ప్రోగ్రామ్ కోసం నమోదు చేసుకోవాలి.కొత్త అకౌంట్‌ను యాడ్ చేయడానికి మీరు సెట్టింగ్స్‌కు వెళ్లి క్యూఆర్ కోడ్ బటన్ పక్కన ఉన్న యారో సింబల్‌పై నొక్కాలి. అక్కడ నుంచి మీరు అకౌంట్‌ను యాడ్ చేయగలరు. అకౌంట్‌ను యాడ్ చేసిన తర్వాత మీరు దాని నుంచి లాగ్ అవుట్ అయ్యే వరకు ఆ అకౌంట్ కూడా మీ డివైస్‌లో లాగిన్ అయి ఉంటుంది. అంటే మీరు ఖాతాలను స్విచ్ చేసినప్పుడు మళ్లీ మళ్లీ లాగిన్ చేయవలసిన అవసరం ఉండదు.

## ఎస్ డి పి ఐ ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండా ర్యాలీ



ఎమ్మిగనూరు ఆగష్టు 14 విభారె న్యూస్.నేడు స్వాతంత్ర దినోత్సవంను పురస్కరించుకొని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో 300 అడుగుల జాతీయ జెండా ర్యాలీని పట్టణంలోని గోనెగండ్ల బైపాస్ రోడ్డు, కేజీఎన్ సర్కిల్ నుండి ఉదయం గం.9.00 లకు ర్యాలీ ప్రారంభమగును. పట్టణ ప్రజలందరూ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయవలెనని ఎస్ డి పి ఐ పిలుపునిచ్చారు.

## సోగనూరు గ్రామ 2 వ వార్డు అభ్యర్థిగా చాకలి ఎల్లప్ప ఏకగ్రీవం.



ఎమ్మిగనూరు ఆగష్టు 14 విభారె న్యూస్.సోమవారం రోజు ఎమ్మిగనూరు మండలంలోని సోగనూరు గ్రామంలో 2వ వార్డు అభ్యర్థిగా చాకలి ఎల్లప్ప ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఇటీవల కాలంలో సోగనూరు గ్రామానికి చెందిన 2 వ వార్డు వైసిపి అభ్యర్థి గా గెలిచిన చాకలి గౌరమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో 2వ వార్డుకు ఎన్నికల నగారా మోగినది. ఈ సందర్భంగా టిడిపి తరపున 2 నామినేషన్లు వేయగా నామినేషన్ల ఉప సంహరణ సందర్భంగా సోమవారం 1 నామినేషన్ ను ఉపసంహరించుకోవడంతో 2వ వార్డు టిడిపి అభ్యర్థిగా చాకలి ఎల్లప్ప ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించి వారికి డిక్లరేషన్ పారములను అందివ్వడం జరిగినది.

## శ్రీశైల దేవస్థాన అన్న ప్రసాద వితరణ కు హైదరాబాద్ వాస్తవ్యులు విరాళం.



శ్రీశైలం ఆగష్టు 14 విభారె న్యూస్.శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి ఆలయంలో నిత్యం జరిగే అన్న ప్రసాద వితరణకు గాను హైదరాబాదు వాస్తవ్యులు మాగంటి జనార్ధన్ యాదవ్ వారు ఆలయ పర్యవేక్షకులు ఎ. నాగరాజుకు రు..1,00,116 ను విరాళంగా అందజేశారు. వీరికి దేవాలయం వారు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి శాలువాతో సత్కరించి స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని, చిత్రపటం ను అందజేశారు.

## విద్యార్థులతో భారతదేశం చిత్రపటం

### వినూత్న రీతిలో 77 స్వాతంత్ర వేడుకలకు స్వాగతం

### భారతదేశం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ఆళ్లగడ్డ ప్రతినిది ఆగస్టు 14విభారె న్యూస్ : ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాల విద్యార్థులు వినూత్నంగా కూర్చుని పలువురిని ఆకట్టుకున్నారు. ప్రైవేటు పాఠశాలల నంద్యాల డివిజన్ అధ్యక్షులు టి అమిర్ భాష ఆధ్వర్యంలో విశ్వశాంతి హై స్కూల్ లో కరస్పాండెంట్ శ్రీనాథ్ రెడ్డి సహకారంతో భారతదేశ ముఖ చిత్ర నిర్మాణ ఆకారంలో విద్యార్థులు కూర్చొని 77వ స్వాతంత్ర్య దినోత్సవానికి స్వాగతం పలుకుతూ అక్షర క్రమంలో కూర్చుని జాతీయ జెండాలు చేత పట్టుకుని జై బో భారత్ మాతాకీ జై జై బో స్వతంత్ర భారత్ కి వందేమాతరం సారే జహా అచ్చా హై హిందుస్థాన్ హమా హమారా అంటూ నినాదా చేశారు. స్వాతం సమరయోధులను పేరుపేరు స్మరిస్తూ దేశభక్తిలో స్ఫూర్తి నిలిచి ఆగస్టు 15న ప్రతి ఇం జాతీయ జెండా ఎగురవేయా పిలుపునిచ్చారు.



## కృష్ణాలో అరుదైన వజ్రం

విజయవాడ, ఆగస్టు 14, ఓ వ్యక్తికి దొరికిన వజ్రం దొరకడంతో విషయం ఆనోటా ఈనోటా పాకడంతో చుట్టుపక్కల గ్రామాల వారు అక్కడికి వెళ్లి వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం గుడిమెట్లలో ఇది జరిగింది. అరుదైన వజ్రం దొరకడంతో భారీ సంఖ్యలో స్థానికులు అక్కడికి వెళ్లి వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. సత్తెనపల్లి సమీపంలోని బిగుబండ గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఎన్టీఆర్ జిల్లా గుడిమెట్లలో వజ్రాల కోసం వేట సాగిస్తోంది. ఈ క్రమంలో ఓ వ్యక్తికి అరుదైన వజ్రం దొరికింది. వజ్రానికి 6 కోణాలు ఉండటం, ఇది షడ్ బుజి వజ్రం కావడం తో మంచి డిమాండ్ వచ్చింది. దీని విలువ అరకోటి ఉంటుందని భావిస్తున్నారు. దాదాపు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు షడ్ బుజి వజ్రం ధర ఉంటుందని అంచనా వేస్తున్నారు. వజ్రం దొరికిందని ఆనోటా ఈనోటా పాకడంతో స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న వజ్రాల వ్యాపారులు ఆ కుటుంబాన్ని సంప్రదించారు. రూ.40 లక్షలు ఇస్తామని, తమకు ఆ అరుదైన వజ్రాన్ని విక్రయించాలని బేరసారాలు జరిపారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఆరు భుజాలు కలిగిన వజ్రానికి మరింత ధర వస్తుంది, మంచి ఆఫర్ కోసం వాళ్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. గుడిమెట్లతో పాటు ఏపీలో కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వజ్రాల కోసం నిరంతరం ఏదో చోట తవ్వుతూ ఉంటారని తెలుస్తోంది.ఓ వ్యక్తికి అరుదైన వజ్రం దొరికిందని తెలియడంతో గుడిమెట్లకు స్థానికులు క్యూ కట్టారు. లంచ్ బాక్సులతో సహా అక్కడ వాలిపోతున్నారు. కుటుంబాలు కుటుంబాలు గుడిమెట్లకు వచ్చి వజ్రాల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేట కొనసాగిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతం రాజుల పాలనలో ఉందని, కనుక వజ్రాలు దొరుకుతాయని స్థానికులు నమ్ముతున్నారు. రాత్రిళ్లు సైతం లైట్లు వేసుకుని మరీ భారీ గుంతలు తవ్వుతూ వజ్రాల కోసం వెతుకుతున్నారు.

# టీడీపీ గూటికి యార్లగడ్డ...



విజయవాడ, ఆగస్టు 14, గన్నవరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు తారా స్థాయికి చేరాయి. దీంతో ఆ పార్టీని వీడేందుకు యార్లగడ్డ వెంకటరావు రెడీ అయ్యారని సన్నిహితులు చెబుతున్నారు. పార్టీ వర్గాల్లో కూడా? ఎప్పటి నుం?చ ప్రచారం జరుగుతోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గన్నవరం నియోజకవర్గంలో ఇప్పటికే తారా స్థాయికి విభేదాలు చేరాయి. తెలుగు దేశం పార్టీ నుంచి గెలుపొందిన వల్లభనేని వంశీ మోహన్ ఎన్నికల తరువాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. జగన్ వెంట నడవాలని నిర్ణయించుకున్నారు.అప్పటి నుంచి గన్నవరం వైఎస్ఆర్‌సీపీలో రాజకీయ రగడ రాజుకుంది. వంశీ రాకను ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన నేతలు వ్యతిరేకించారు. ఈ వ్యవహారం ముఖ్యమంత్రి జగన్ వద్ద కూడా పంచాయితీ నడిచింది. అయినా వివాదానికి తెర పడలేదు. అధినాయకత్వం కూడా వంశీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న నాయకులను లైట్ తీసుకున్నారు. అధినాయకత్వం వంశీని వెనకేసుకొస్తున్నందున ఆయన్ని వ్యతిరేకించిన యార్లగడ్డ వెంకటరావు తెలుగు దేశం పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారని టాక్ నడుస్తోంది. నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో పాల్గొన టీడీపీ కండువా కప్పుకోవాలని చూస్తున్నారట. గన్నవరం నియోజకవర్గంలోకి త్వరలోనే యువగళం పాదయాత్ర ఎంట్రీ ఇస్తుంది. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకటరావు సైకిల్ ఎక్కి గెలుపు జెండా ఎగరేయాలని చూస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గన్నవరం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య విభేదాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. బహిరంగంగానే వల్లభనేని వంశీ, యార్లగడ్డ వెంకటరావు చేతులు కలిపి కలసి పని చేయాలని జగన్ నచ్చ చెప్పారు. అయినా యార్లగడ్డ వెంకటరావు, వంశీతో కలసి పని చేసేందుకు ససేమిరా అన్నారు. నియోజకవర్గంలో ఉన్న డాక్టర్ దుట్టా రామచంద్రరావుతో కలసి వంశీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఇవన్నీ పట్టించుకోకుండా ముఖ్యమంత్రి జగన్ వచ్చే ఎన్నికల్లో వల్లభనేని వంశీకి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున సీటు ఇచ్చేందుకు అంగీకరించారు. దీనిపై బహిరంగంగానే దుట్టా, యార్ల అసహనం వ్యక్తం చేశారు. అయినా ఈ ఇద్దరు నేతలను కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదు. 2019ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున యార్లగడ్డ వెంకటరావు తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా ఉన్న వంశీకి వ్యతిరేకంగా పోటీ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హవా గట్టిగానే వీచినప్పటికి తెలుగు దేశం పార్టీ తరపున వల్లభనేని వంశీనే శాసన సభ్యుడిగా గెలుపొందారు. తెలుగు దేశం తరపున వల్లభనేని వంశీ 990 ఓట్ల మెజార్టీతో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధి యార్లగడ్డ వెంకటరావుపై గెలుపొందారు. దీంతో ఇప్పుడు అదే అంశంపై యార్లగడ్డ వెంకటరావు దూకుడుగా ఉన్నారని అంటున్నారు. గన్నవరం లో వంశీకి ఎదురు గాలి ఉందని, గత ఎన్నికల్లో వంశీ కేవలం 990ఓట్ల మెజార్టీతో గెలుపొందారు కాబట్టి, ఈ సారి ఎన్నికల్లో వంశీని ఓడించటం పెద్ద కష్టం కాదని వెంకటరావు వర్గం భావిస్తున్నట్లుగా చెబుతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటంతో పాటుగా, గుడివాడ, గన్నవరం నియోజకవర్గాలపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. దీంతో ఇప్పుడు గన్నవరం నియోజకవర్గంలో శాసన సభ్యుడు వల్లభనేని వంశీని ఓడించటమే ప్రధాన టార్గెట్‌గా ప్రతిపక్షాలు సిద్దమయ్యాయి. ఇప్పుడు యార్లగడ్డ కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగు దేశానికి చేరువ కావటంతో, రాజకీయం మరింత వేడెక్కింది. అధికార పక్షం సపోర్ట్ వంశీకే ఉన్నందున వచ్చే ఎన్నికల్లో గన్న'వరం" ఎవరికి అన్నదాని పై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది

## కాసులు కురిపిస్తున్న కురులు



తిరుమల, ఆగస్టు 14, ఆపదమొక్కుల స్వామి శ్రీ వెంకటేశ్వరుడి కి తలనీలాలు సమర్పించడం భక్తుల మొక్కులో ఒక భాగం. కోరుకున్న మొక్కులు తీరగానే తలనీలాలు సమర్పించి శ్రీవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య తిరుమల కొండలు అంతకంతకు పెరుగుతూనే ఉంది. రోజు తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తుల్లో చాలామంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకుంటుండంతో వెంకన్న ఆదాయం అంతకంతకు పెరుగుతోంది. తిరుమలలో భక్తులు తలనీలాలు సమర్పించేందుకు టీటీడీ కళ్యాణకట్ట తో పాటు చాలా ప్రాంతాలను ఏర్పాటు చేసింది. ఇలా గుండు కొట్టి గోవిందుడి మొక్కు తీర్చుతున్న భక్తుడి ఆదాయం ఏటా టీటీడీ కి రూ. 120 కోట్లకు పైగానే ఉంటుంది. ఇలా గత ఐదారేళ్లుగా టీటీడీకి తలనీలాల ఆదాయం అంతకంతకు పెరిగి ఈ ఏడాది మరో రికార్డు ను నమోదు చేయబోతోంది. ఇప్పటిదాకా ఏటా రూ.120 కోట్లు వస్తోందని టీటీడీ లెక్కలు చెబుతుండగా ఈ ఏడాది రూ. 150 కోట్లుకు పైనే ఉండబోతోంది.ప్రతి ఏడాది నాలుగు సార్లు ఈ ఆక్షన్ నిర్వహిస్తున్న టీటీడీ తలనీలాలను గ్రేడులు వారీగా విభజించి ఈ ఆక్షన్ నిర్వహిస్తోంది. 5 గ్రేడులుగా విభజించి తలనీలాలను వేలం వేస్తున్న టీటీడీ మొదటి మూడు గ్రేడ్ లలో డ్రై, బ్లాక్ హెయిర్ ను వేరుచేసి రెండు రకాలుగా విభజిస్తుంది. తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ గౌడన్ లో భక్తుల తలనీలాల గ్రేడింగ్ ప్రక్రియ చేపడుతున్న టీటీడీ తిరుమల నుంచి ఒక రోజుకు 1400 కేజీల తలనీలాలను సేకరిస్తోంది. తిరుమలలోని టీటీడీ కళ్యాణ కట్ట, గెస్ట్ హౌస్ లో తలనీలాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేసిన టిటిడి తలనీలాలు సేకరణలో పలు జాగ్రత్తలు కూడా పాటిస్తోంది. మొక్కులో భాగంగా భక్తులు సమర్పించే తలనీలాలు రోజూ తడిగా ఉండే 1400 కేజీలు కాగా తలనీలాలు డ్రై అయ్యాక ఒకమెట్రిక్ టన్ను వరకు టిటిడి గోడౌన్ కు చేరుతుంది. కరోనా తర్వాత శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లుగానే తలనీలాల ఆదాయం టీటీడీ కి విపరీతంగా పెరిగింది. ఐదారేళ్ళుగా ఏటా రూ. 120 కోట్లకు పైగా టిటిడి కి ఆదాయం వస్తుండగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.120 కోట్లు ఆలయం టిటిడి కి వచ్చింది. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటివరకు రెండుసార్లు ఈ ఆక్షన్ నిర్వహించిన టీటీడీ ఇప్పటివరకు దాదాపు రూ.105 కోట్ల మేర ఆదాయం పొందింది. మరో రెండు సార్లు ఈ ఆక్షన్ నిర్వహించేందుకు టీటీడీ సిద్ధమవుతుండగా ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం ఏకంగా రూ. 150 కోట్లకు పైగా ఉంటుందని టీటీడీ అంచనా వేస్తోంది. దీంతో భక్తులు సమర్పించే కురులు శ్రీవారి హుండీ ఆదాయానికి కాసులను కురిపిస్తోంది.

# ఏపీలో మాటల మంటలు

### వార్నింగ్ లు ఇస్తున్ననేతలు


విశాఖపట్టణం, ఆగస్టు 14,ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు రోజురోజుకు హీటెక్కుతున్నాయి. అధికార పార్టీ వైసీపీ వర్సెస్ ప్రతిపక్ష పార్టీలు జనసేన, టీడీపీ మాటల తూటాలతో దూసుకెళ్తున్నాయి. ఒకటంటే.. రెండంటాం.. అంటూ పవన్ కల్యాణ్ టార్గెట్‌గా వైఎస్ఆర్‌సీపీ మండిపడుతోంది. రుషికొండ నిర్మాణాలతో మొదలైన రగడ కాస్త.. చినికి చినికి గాలి వానలా మారింది. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోశాయి. వాలంటీర్లను దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చిన పవన్ కల్యాణ్‌పై అధికారపార్టీ వైసీపీ కౌంటర్ ఎటాక్ చేస్తూ వస్తోంది. నిన్నటి వ్యాఖ్యల మంటలు చల్లారకముందే.. తాజాగా వైసీపీ మంత్రులు పవన్ పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మినిస్టర్స్.. అంబటి రాంబాబు, రోజా, కారుమూరి తాజాగా పలు వ్యాఖ్యలు చేశారు. విశాఖ బ్రాండ్‌ను నాశనం చేసేలా పవన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు మంత్రి రోజా. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదంటూ వార్నింగ్ ఇచ్చారు అంబటి. పవన్ ఇలాగే మాట్లాడితే ప్రజలే ఛీకొడతారన్నారు మరో మంత్రి కారుమూరి. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అయితే.. పవన్‌పై పర్సనల్ ఎటాక్‌కి దిగారు. దీంతో ఏపీ రాజకీయాలు మరింత హీటెక్కాయి. పవన్ కల్యాణ్ పై మంత్రులు ఏమన్నారో ఒకసారి చూద్దాం..ఏపీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. పవన్‌కళ్యాణ్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు,పవన్‌కళ్యాణ్ చాలా అసహనంతో ఉన్నారు. పవన్ చంద్రబాబుతో కలిసి హింసను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఇద్దరు అసహనంతో సీఎం జగన్‌పై విమర్శలు చేస్తున్నారు మండిపడ్డారు. చంద్రబాబును సీఎం చేయడమే పవన్ లక్ష్యమన్నారు. పవన్‌కళ్యాణ్ జనసేన కార్యకర్తలను నిండా ముంచుతారని హెచ్చరించారు. సీఎం జగన్‌పై పవన్ అర్థం లేని విమర్శలు చేస్తున్నారని.. ప్రాజెక్ట్‌ల పేరుతో గతంలో టీడీపీ దోపిడీకి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పవన్‌కళ్యాణ్ తనకు మోసం చేశాడని స్వయంగా రేణుదేశాయ్ ఆరోపించారన్నారు అంబటి రాంబాబు. హిందూ మహిళగా ఆమె చేసిన కామెంట్లను తాను సమర్థిస్తునట్టు తెలిపారు. అయితే ఏపీ ప్రజలు పవన్‌కు ఒక్క అవకాశం కూడా ఇవ్వరని స్పష్టం చేశారు మంత్రి అంబటి రాంబాబు.విశాఖ బ్రాండ్ నాశనం చేసేలా చంద్రబాబు, పవన్ మాట్లాడుతున్నారని మంత్రి రోజా మండిపడ్డారు. రుషికొండపై నిర్మాణాలన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయన్నారు. రుషికొండపై కొత్త భవనాలు కడితే తప్పేంటి..? నిబంధనలకులోబడే రుషికొండపై నిర్మాణాలు జరుగుతున్నాయి.. పవన్ మెంటల్ హాస్పిటల్‌లో చేరాలంటూ రోజా ఫైర్ అయ్యారు. ఎన్ని కుట్రలు చేసినా విశాఖ రాజధాని రాకుండా ఆపలేరు.. అంటూ రోజా స్పష్టంచేశారు.వాలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువైందన్నారు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు. వాలంటీర్ల వ్యవస్థను పవన్ దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చడాన్ని తీవ్రంగా ఖండించారు..పవన్ ఇలాగే మాట్లాడితే ప్రజలే ఛీకొడతారంటూ విమర్శించారు.విశాఖలో కబ్జాలు, అక్రమాలపై పవన్ కామెంట్లకు కౌంటర్ ఇచ్చారు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ. తమ సంస్థ చేపట్టిన నిర్మాణాలన్నీ సక్రమేనని స్పష్టం చేశారు. ఇక కుటుంబసభ్యుల కిడ్నాప్ డ్రామాను వక్రీకరిస్తున్నారని మండిపడ్డ ఎంవీవీ.. విశాఖలో పవన్‌కు అడుగుపెట్టే అర్హతే లేదన్నారు. అంతేకాకుండా పవన్ కల్యాణ్‌పై పర్సనల్ ఎటాక్‌కి దిగారు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ. పెళ్లిళు, పిల్లల ప్రస్తావన తీసుకొచ్చారాయన. మరోవైపు చంద్రబాబు మోచేతి నీళు తాగుతున్నాడని విమర్శించారు.

## వ్యూహంలో వివేకా మర్డర్...

విజయవాడ, ఆగస్టు 14, రామ్‌గోపాల్ వర్మ.. ఈ పేరు సినిమా ఇండస్ట్రీలో ఒక సంచలనం. ఆయన తీసే ప్రతి సినిమా ఏదో ఒక వివాదం రాజేస్తూ ఉంటుంది. గతంలో అమ్మ రాజ్యం కడప బిడ్డలు సినిమా తీసి వివదాలకు తెరతీశారు. దాని తరువాత లక్ష్మీ పార్వతి వృత్తాంతంతో లక్ష్మీస్ ఎన్టీఆర్ తీశారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ మోహన్ రెడ్డి కథతో వ్యూహం తెరకెక్కిస్తున్నారు. చిత్రం షూటింగ్ ప్రారంభించినప్పటి నుంచి నిత్యం వార్తల్లో ఉంటోంది.రామదూత క్రియేషన్స్ పతాకంపై వ్యూహం చిత్రాన్ని ఆర్జీవీ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి దాసరి కిరణ్ కుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో సీఎం జగన్‌గా అజ్మల్, భారతీగా మానస నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ విజయవాడలోని ప్రకాశం బ్యారేజీపై జరుగుతోంది. వ్యూహంలో ఎవరిని టార్గెట్ చేయడం లేదన్నారు. జగన్ జీవితంలోని ముఖ్య ఘట్టాల ఆధారంగా జగన్ అంటే ఏంటో చూపిస్తానని స్పష్టం చేశారు. తాను నమ్మిన నిజాన్ని చూపిస్తున్నానని.. ఈ సినిమాలో ఎన్నో అంశాలు ఉంటాయని చెప్పారు. వ్యూహంలో తన అభిప్రాయం మాత్రమే ఉంటుందన్నారు. తాను నమ్మిన నిజాన్ని చూపిస్తున్నానని అన్నారు. వివేకా హత్య గురించి కూడా ప్రస్తావిస్తానని ఆర్జీవీ స్పష్టం చేశారు. పొగడ్తలు అంటే తనకు చిరాకు అని, విమర్శలు అంటే నాకు చాలా ఇష్టమన్నారు. తనకు ఏది ఇంట్రెస్ట్ ఉంటే అది చేస్తానని, వ్యూహం ఎవరినీ టార్గెట్ చేయలేదన్నారు. సీఎం జగన్‌పై నాకున్న అభిప్రాయాలను మాత్రమే చూపిస్తానని అన్నారు. సినిమా గురించి ఇప్పుడే అన్ని చెబితే ఆసక్తి ఉండదన్నారు. సినిమాల్లో సందేశాలు ఇచ్చే అలవాటు తనకు లేదన్నారు.ఈ సినిమా వెనుక వైసీపీ నేతలు లేరని స్పష్టం చేశారు. 60 నుంచి 70 శాతం సినిమా కంప్లీట్ అయ్యిందని, త్వరలోనే సినిమాను రిలీజ్ చేస్తామని రామ్ గోపాల్ వర్మ పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ తప్పించి మెగా ఫ్యామిలీలో ఏ ఒక్కరూ తనను కామెంట్ చేయడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో వ్యూహం సినిమా కచ్చితంగా ప్రభావం చూపుతుందని ఆర్జీవీ పేర్కొన్నారు. తాను నమ్మిన విషయాన్నేసినిమాగా తీస్తానని రామ్ గోపాల్ వర్మ చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం నుంచి వ్యూహం కథాంశం సాగుతుందన్నారు. వైఎస్సార్ మరణం తరువాత పరిణామాలు, ఎవరు ఎలాంటి వ్యూహాలు వేశారో సినిమాలో చెబుతామన్నారు. ప్రకాశం బ్యారేజీ పై వ్యూహం సినిమా షూటింగ్ జరుగుతోందని చెప్పారు. రెండు భాగాలుగా ఎన్నికలకు ముందే విడుదల చేస్తామన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు పిలిచి అడిగినా దర్శకత్వం చేయనన్నారు. తనకు నచ్చిన పని మాత్రమే చేస్తానన్నారు. రాజ్యసభలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి హీరోల రెమ్యూనరేషన్‌పై చేసిన వ్యాఖ్యలపైనా ఆర్జీవీ స్పందించారు. తప్పంతా రెమ్యూనరేషన్ ఇచ్చే వాడిదేనని, తీసుకునేవాడిది కాదన్నారు. హీరోల మార్కెట్‌ను బట్టి రెమ్యూనరేషన్ ఉంటుందని ఆర్జీవీ స్పష్టం చేశారు. చిరంజీవి ఏ ఉద్దేశంతో కామెంట్స్ చేశారో తెలియదన్నారు. భోళా శంకర్ సినిమా డాకుమెంట్స్ ఏవో టైంకు ఇవ్వలేదని తెలిసిందని, ఆ వివరాలు పూర్తిగా తనకు తెలియవన్నారు.

# చిరుతను బంధించేందుకు రంగంలోకి దిగిన ఫారెస్ట్, టీటీడీ

తిరుపతి, ఆగస్టు 14, అలిపిరి నడక మార్గంలో శుక్రవారం సాయంత్రం బాలికపై చిరుత దాడి చేసి చంపేసిన ఘటనతో టీటీడీ అప్రమత్తం అయ్యింది. నడక మార్గం భక్తుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏడో మైలు నుండి శ్రీ నృసింహా ఆలయం వరకూ హై అలర్ట్ జోన్ గా ప్రకటించింది. చిరుతను బంధించేందుకు టీటీడీ అటవీశాఖ అధికారులు బోన్లను ఏర్పాటు చేశారు. అలిపిరి నడక మార్గం గుండా తిరుమలకు వచ్చే భక్తులను హైఅలర్ట్ గా ప్రకటించిన ప్రాంతంలో 100 మంది భక్తుల గుంపుని మాత్రమే అనుమతించేలా ఏర్పాట్లు చేస్తుంది. భక్తులకు ముందు వైపు, వెనుక వైపు రోప్ లు ఏర్పాటు చేసింది. భక్తులకు సెక్యూరిటి సిబ్బందిని నియామించింది. నడక మార్గంలో కొన్నిచోట్ల ప్రతి పది మీటర్లకు ఓ సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు టీటీటీ ఈవో ధర్మారెడ్డి చెప్పారు. 7వ మైలు నుంచి నరశింహస్వామి ఆలయం వరకు భక్తులుకు భద్రతా సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరి చేయడంతో పాటుగా, హై అలర్ట్ ప్రదేశంలో వన్య మృగాలను సంచారంను గుర్తించేందుకు ముప్పై



ట్రాప్ కెమరాలను ఏర్పాటు చేశారు. పగటి పూట డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ కొనసాగేవిధంగా టిటిడి చర్యలు చేపట్టింది.ఏడో మైలు నుండి శ్రీ నరసింహ ఆలయం వరకూ మూడు పులి బోన్లను టిటిడి అటవీ శాఖా అధికారులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే కాలి నడక బాటలో నేటి నుండి తిరుమల ఘాట్ రోడ్డులో ఆంక్షలు విధిస్తూ, ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకే అనుమతిస్తూ టిటిడి నిర్ణయం తీసుకుంది.నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డి పాలెం వాసులు దినేష్, శశికళ కుటుంబం ఏడు కొండ వేంకటేశ్వర స్వామిని చూసేందుకు వచ్చారు. పదిమంది కలిసి వెళ్తున్నందున కాలినడకన కొండకు వెళ్లాని నిర్ణయించుకున్నారు. అలిపిరిలోని నడక మార్గంలో రాత్రి ఎనిమిది గంటలకు బయల్దేరారు. రాత్రి 11 గంటలకు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఫ్యామిలీలో ఎప్పుడూ హుషారుగా ఉండే లక్షిత వడివడిగా అడుగులు ఆడుతూ పాడుతూ ముందుకెళ్లింది. సీసీ కెమెరాల్లో ఆ విషయం స్పష్టంగా కనిపించింది. ఆనందంగా అందరి కంటే చురుగా మెట్లు ఎక్కుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అలా రాత్రి 11 గంటల సమయానికి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్దకు చేరుకునే సరికి పాప కనిపించలేదు. రాత్రి వేళలో పాప లక్షిత కనిపించకపోయే సరికి తల్లిదండ్రులతోపాటు వారితో వచ్చిన వారిలో కంగారు మొదలైంది. మొత్తం వెతికారు. పిలిచారు అయినా లక్షిత పలకలేదు. ఏం జరిగిందో ఏమో అనుకున్నారు. వెంటనే ఆలయ భద్రతా సిబ్బందికి ఫిర్యాదు చేశారు. పాప కనిపించడం లేదని తెలుసుకున్న టీటీడీ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. వడివడిగా ముందుకు నడుకుంటూ వెళ్లిన పాపను ఎవరైనా ఎత్తుకెళ్లిపోయారేమో అన్న కోణంలోనే వేట సాగించారు. ఉదయం చెట్ల పొదల్లో కాలిమార్గంలో డెడ్ బాడీ చూసేవరకు మాత్రం వాళ్లుకు చిరుత దాడి చేసిన సంగతి గమనించలేకపోయారు. చిరుత దాడి చేసే అవకాశం లేదని ఎలుగుబంటి దాడి చేసి ఉండొచ్చని అనుమాన పడ్డారు. దీంతో అందరిలోనూ అనమానాలు కలిగాయి. అయితే పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు చిరుత దాడిలో పాప చనిపోయిందని క్లారిటీ ఇచ్చేశారు. చిన్నారులకు ట్యాగ్స్అలిపిరి నడక మార్గంలో చిన్నారులపై ఇటీవల చిరుత పులుల దాడులు పెరిగిపోయాయి. జూన్ నెలలో ఓ బాలుడిపై చిరుత దాడి చేసి గాయపరిచింది. భక్తులు, బాలుడి తాత చిరుతను వెంబడిస్తూ గట్టిగా కేకలు వేయడంతో బాలుడ్ని అక్కడే వదిలిపెట్టింది. గాయపడ్డ బాలుడు కొన్ని రోజులకు కోలుకున్నాడు. టీటీడీ వారికి అన్ని విధాలుగా సహకరించింది, శ్రీవారి దర్శనం చేసుకునే ఏర్పాట్లు సైతం చేసింది. కానీ ఇటీవల నెల్లూరు జిల్లా పోతిరెడ్డిపాలానికి చెందిన చిన్నారి లక్షితపై నడకమార్గంలో చిరుత దాడి చేసి చంపేసింది. చిరుత సంచారం, చిన్నారులపై వరుస దాడులతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అప్రమత్తం అయ్యారు.తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు నడక మార్గంలో వచ్చే చిన్న పిల్లల తల్లిదండ్రులకు పోలీసులు పలు సూచనలు చేశారు. అలిపిరి నడక మార్గం వద్ద చిన్నపిల్లలకు ట్యాగ్స్ వేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. అంతే కాకుండా ఇలా వేసిన ట్యాగ్స్ ను గాలి గోపురం వద్ద, అదే విధంగా ఏడో మైలు వద్ద సిబ్బంది పరిశీలిస్తున్నారు. కేవలం 15 సంవత్సరాల లోపు చిన్నారులకు మాత్రమే పోలీసులు ట్యాగ్స్ వేయనున్నారు. చిన్నారుల చేతికి ట్యాగ్స్ ఉంటే ఎవరైనా చిన్నారులు తప్పిపోతే గుర్తించేందుకు సులభంగా ఉంటుందని టీటీడీ, అటవీశాఖ భావిస్తోంది. 15 ఏళ్లలోపు చిన్నారుల చేతికి సిబ్బంది నడకమార్గంలో వేసే ట్యాగ్ ద్వారా ఎవరైనా తప్పిపోయినా త్వరగా తల్లిదండ్రుల వద్దకు చేరే అవకాశం ఉండడంతో టిటిడి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ట్యాగ్స్ పై చిన్నారుల తల్లిదండ్రుల పేర్లు, ఫోన్స్ నెంబర్లు, టోల్ ఫ్రీ నెంబర్ ను రాసి చిన్నారులకు ట్యాగ్స్ ను వేస్తున్నారు. అంతే కాకుండా అలిపిరి నడక మార్గంలో హై అలర్ట్ ప్రకటించిన ప్రాంతంలో మధ్యాహ్నం సాయంత్రం 6 గంటల నుంచి 100 మందిని కలిపి గుంపులు గుంపులుగా 7వ మైలు నుంచి శ్రీ నృశింహ స్వామి వారి ఆలయం వరకు భక్తులను పంపుతున్నారు. అంతే కాకుండా ఈ గుంపులకు ముందు భాగంలోనూ, వెనుక పోలీసు సిబ్బంది భద్రత కల్పించనున్నారు.

విభారె



## ఇసుక దందా పట్టించుకోని అధికారులు



అనంతపురం ప్రతినిధి విభారే న్యూస్ ఆగస్టు13 జిల్లాలో అక్రమ రవాణా ను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు కుడేరు మండల పరిధిలోని పి.ఏ.బి.అర్ డ్యాం ఏట్లో నుండి ప్రతిరోజు రాత్రి పగలు తేడా లేకుండా ఎలాంటి అనుమతులు లేకుండా జెసిబి ల ద్వారా తవ్వించి డాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న కూడా వీటిపై మండల అధికారులు గాని పోలీసులు గాని ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆ గ్రామస్తులు విమర్శిస్తున్నారు అంతేకాకుండా వాలంటరీ ద్వారా కూడా సచివాలయం మరియు తహసిల్దార్ కార్యాలయం కు ఫిర్యాదు చేయించిన ఏ మాత్రం చర్యలు లేవని ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది

## వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధితోనే రాష్ట్ర, దేశ సమగ్రాభివృద్ధి ముడిపడి ఉంది--- బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 14 విభారె న్యూస్ :-పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో సోమవారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో దశరథరామిరెడ్డి పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ. వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉంది, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం మరియు నీటి లభ్యతకు ఆయా రాష్ట్రాల నీటి వాటాలో అంతర్గత సర్దుబాట్లు, నదుల అనుసంధానం ద్వారా చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ దిశగా చేపట్టే కార్యక్రమాలలో వెనుకబడిన ఇతర ప్రాంతాల ఉనికికి, అభివృద్ధికి ఆటంకం కాకుండా చూడవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉందని ఆయన స్పష్టం చేసారు. కానీ తమ రాజకీయ లబ్ది ప్రాధాన్యతగా కేంద్ర ప్రభుత్వం కర్నాటకలోని అప్పర్ బద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా, తెలంగాణ లోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు మంజూరు చేసే దిశలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ అవసరాలను పరిగణనలోకి తీసుకోక పోవడం ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాయలసీమ సమాజం కూడా మనకు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## స్వాతంత్ర సమరయోధుల లక్ష్యం స్వేచ్ఛ సమానత్వం ----ఎస్ ఎఫ్ ఐ

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 14 విభారె న్యూస్ :-నంద్యాల జిల్లా పాణ్యం నియోజవర్గ కేంద్రంలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుల ఫోటోలతో 55 అడుగుల త్రివర్ణ పతాకం జాతీయ జెండాతో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సహాయకార్యదర్శి బత్తిని ప్రతాప్ వనము వెంకటాద్రి మాట్లాడుతూ మన భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాల వెళుతున్న ఇప్పటికీ మన భారతదేశంలో స్త్రీలు ఒంటరిగా వెళ్లడానికి తీవ్ర భయానికి గురవుతున్నారు. వైద్య విద్య వ్యవస్థలో కూడా స్వాతంత్రం లేకుండా దోపిడిదారులకు దళారుల వ్యవస్థ పాలవుతుంది . బ్రిటిష్ వాళ్లకి ఎదురెళ్లి ఎంతోమంది స్వతంత్ర సమరయోధులు స్వాతంత్రం తీసుకొచ్చింది స్వేచ్ఛ సమానత్వం కోసం . స్వాతంత్రం వచ్చి ఎన్ని సంవత్సరాలు అవుతున్న ఆడవాళ్లకు ఎక్కడ రక్షణ లేదు లైంగిక దాడులు మర్డర్లు మన భారతదేశంలో ఎక్కువ స్థాయిలో జరుగుతున్నాయి. అదేవిధంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని కూడా రక్షణ లేకుండా అవుతుంది. రాజ్యాంగబద్ధ పాలన కాకుండా రాజకీయమైన పాలన చేస్తున్నారు . ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు బస్సు ఏర్పాటు చేయాలి. ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్

ఆదోని, ఆగష్టు 14 విభారె న్యూస్ : ఆదోని నుండి పుట్టుకలమారి ఏపీ మోడల్ పాఠశాలకు మరో రెండు బస్సులు ఏర్పాటు చేయవలసినదిగా ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈశ్వర్ ఏఐవైఎఫ్ ఆస్పరి మండల కార్యదర్శి రమేష్ బి డి ఎస్ ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ ఆదోని సబ్ కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ఆస్పరి మండలం పుట్టుకలమారి ఏపీ మోడల్ స్కూల్లో చదువుతున్నటువంటి విద్యార్థులకు సాయంత్రం 4:00 గంటలకు పాఠశాల నుండి విద్యార్థి బస్ రావాలని కోరడమైనది. ఏపీ మోడల్ స్కూలుకు దాదాపు 700 మంది విద్యార్థులు ఉన్నారని మరియు వారిలో చాలామంది పాఠశాలకు రావడానికి వివిధ గ్రామాల నుండి బస్ సర్వీస్ ను ఉపయోగిస్తున్నారని సబ్ కలెక్టర్ తెలియజేశారు. గతంలో ఆదోని నుండి మా పాఠశాలకు ఉదయం రెండు బస్సులు ఉండేవి , ఒక్కటి సాధరణ సర్వీస్ను మరియు మరొకటి విద్యార్థి బస్ అయితే ప్రస్తుతం మా పాఠశాలకు ఉదయం 7 :-20 గంటలకు ఒక బస్సు వస్తుండడంతో చాలామంది విద్యార్థులు సకలం లో బస్సును పట్టించుకోని పాఠశాలకు రాలేకపోతున్నారు. అని మా పాఠశాలకు వివిధ గ్రామాల నుండి చాలామంది విద్యార్థులు వస్తుందన ఆదోని నుండి మా పాఠశాలకు ఫస్ట్ బస్సు ఉదయం 7:-20 రెండో బస్సు ఉదయం 7 :-40 గంటలకు రెండు బస్సులు ఏర్పాటు చేయవలసినదిగా కోరుతున్నాము. అదే సమయంలో మా పాఠశాలకు సాయంత్రం



4:-00 గంటలకు వచ్చే విద్యార్థి బస్సు ఇప్పుడు రావడంలేదని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల పని దినాలలో సాయంత్రం వేళ ఈ విద్యార్థి బస్సును కొనసాగించాలని అన్నారు మరియు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న డిపో మేనేజర్ రఫిక్ సస్పెండ్ చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు అన్నారు అనంతరం స్పందనలో సబ్ కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అర్జిని పరిశీలించిన సబ్ కలెక్టర్ రెండు మూడు రోజులు గడువు లోపు ఈ సమస్య పరిష్కారం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యోహాన్ , సంజయ్, జ్ఞానేశ్వర్ , పవన్ ,సాయి , యుగంధర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే ట్రాక్ పై మృత దేహం



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 14 విభారె న్యూస్ :- నంద్యాల జిల్లా మహానంది మండలం నంది పల్లె సమీపంలో సోమవారం రైల్వే ట్రాక్ పై శిరివెళ్ళ కు చెందిన సుధాకర్ అనే యువకుడి మృతదేహం కనిపించిందని పోలీసులు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్నాడ లేక ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడ అన్న విషయం తెలియాల్సి ఉందని పోలీసులు అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు ...

# స్పందనలో వచ్చిన 89 ఫిర్యాదులను విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం. - జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్.

కర్నూలు ఆగష్టు 14 విభారె న్యూస్. స్పందన కార్యక్రమానికి 89 ఫిర్యాదులు. స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి , పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 89 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) ఇ బే కంపెని పేరుతో వాట్సప్, టెలిగ్రాం లో సంప్రదించారు. ఒక పిక్చర్ కి 200 లైక్స్ చేస్తే పార్ట్ టైమ్ కమిషన్ క్రింద డబ్బులు ఇస్తామన్నారు. మొదటగా ప్రీపెయిడ్ రూ.1,000 కి రూ.1,300 లు,రూ 3,000 లకు 3, 900 ఇస్తూ డబ్బులు ఇస్తూ నమ్మించారు. రూ. 20 వేలు,60 వేలు, 80 వేలు ఇలా పలు దఫాలుగా చార్జీలు, టాక్స్ లు, సెక్యూరిటి డిపాజిట్ ల క్రింద మొత్తం 2 లక్షలు కట్టించుకుని మోసం చేశారని కర్నూలు దిన్నేదేవరపాడు కు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. 2) మా మేనమామ రూ. 17 లక్షలకు పొలం అమ్ముతామని అగ్రిమెంట్ చేసుకున్నారు. తర్వాత పొలం వేరే వాళ్ళకు ఇవ్వాలని నేను వేసుకున్న కంది పంట ను



దున్ని పంట లేకుండా చేసి నష్టం కలిగించాడని,నా డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని ఓర్వకల్లు మండలం, చెన్నం సెట్టు పల్లె గ్రామానికి చెందిన వీర భద్రుడు ఫిర్యాదు చేశారు. 3) అనంతపురం కు చెందిన నలుగురు వ్యక్తులు యోగా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. ట్రైనింగ్ అయిపోయిన తర్వాత గవర్నమెంట్, ప్రవేట్ స్కూళ్ళల్లో మొత్తం 10 మంది కి యోగా టీచర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుండి రూ. 2 లక్షల 50 వేలు తీసుకుని మోసం చేశారని కర్నూలు , దేవనగర్ కు చెందిన మోహన్ రెడ్డి ఫిర్యాదు చేశారు. 4) బీరప్ప గుడి ముందర కూరగాయలు అమ్ముతూ వచ్చి పోయే భక్తులకు ఇబ్బందులు కలుగ జేస్తున్నారని నందవరం మండలం, కనకవీడు గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు వెంకటగిరి , పూజారి బోడన్న ఫిర్యాదు చేశారు. 5) ఆన్ లైన్ లో శివకుమార్ అనే పేరుతో ఒక వ్యక్తి ఫేస్ బుక్ లో పరిచయమై రూ. 1 లక్ష 40 వేలు తీసుకుని సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేశాడని క్రిష్ణ గిరి మండలం, కర్ల కుంట గ్రామానికి చెందిన అలి పీర ఫిర్యాదు చేశారు. 6) ఇద్దరు వ్యక్తులు కర్నూలు, బిర్లా కంపౌండ్ లోని యుకాన్ షాపులో రెండు షాపులు అమ్ముతామని చెప్పి రూ. 7 లక్షల 50 వేలు తీసుకుని పోర్జరీ చేసిన నకిలీ పత్రాలు సృష్టించి మోసం చేశారని కర్నూలు కు చెందిన సునీత ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో డిఎస్పీ యుగంధర్ బాబు ,లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదు మందికి జైలు శిక్ష.....

## జిల్లా అడిషనల్ ఎస్పీ జి .వెంకట రాముడు



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 14 విభారె న్యూస్ :-మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జైలు శిక్షా విధించిన న్యాయస్థానం. నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి వారి అదేశాలమేరకు నంద్యాల పట్టణంలో మద్యం సేవించి వాహనములు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది . ఈ సందర్భంగా నంద్యాల ట్రాఫిక్ పోలీస్ వారు ట్రాఫిక్ సిఐ శ్రీ షేక్.ఇస్మాయిల్ ఆధ్వర్యంలో వారి సిబ్బందిచే సంజీవ నగర్ గెట్ వద్ద డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా ఐదు మంది మద్యం తాగి వాహనాలు నదిపుతు పోలీస్ వారి తనిఖీలో పట్టుబడడం జరిగింది. సోమవారం కోర్ట్ లో వారిని హాజరు పెట్టగా గౌరవ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ ఆర్.రాంభూపాల్ రెడ్డి గారు మద్యం తాగి వాహనాలు నడిపి ఐదు మందికి జైలు శిక్ష విధించారు. ఈ సంధర్భంగా అడిషనల్ ఎస్పి గారు మాట్లాడుతూ ప్రతి రోజు జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ పరిదులలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు .

## జిల్లాలో ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో జెండా ఆవిష్కరించాలి

## కె. సుధాకర్ రెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 14 విభారె న్యూస్ :-. నంద్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ది.15-08-2023న జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఆయా పాఠశాలల్లో, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జాతీయ జెండాను అవిష్కరించాలని ఒక వేళ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లేని పక్షంలో సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండా అవిష్కరించాలని ఈ. విషయములో ఉప విద్యాశాఖాధికారులు మరియు మండల విద్యాశాఖాధికారుపలు తగు చర్యలు గైకొనవలసినదిగా నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీ కె. సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.



## కలవర పెడుతున్న కళ్ళ కలక.

## వ్యాప్తి నివారణకు జాగ్రత్తలు పాటిస్తే మేలు డాక్టర్ అంకిరెడ్డి హెల్త్ ఆఫీసర్.

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 14 విభారె న్యూస్ :-కళ్ల కలక బారినపడిన వారు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇతరులకు వ్యాపించకుండా నివారించ వచ్చని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి పేర్కొంటున్నారు . సోమవారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారు నల్ల కళ్ల జోడు వాడాలి. ఇతరులకుసాధ్యమైనంత దూరం గా ఉండాలి. కరచాలనం చేయడం, తాకడం మానుకోవాలి. చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. కంటిని నులమడం, రుద్దడం లాంటివి చేయకూడదు. కళ్ల కలకతో బాధపడే వారు వాడిన సబ్బు, బెడ్షీట్లు, టవళ్లు ఇతరులు వినియోగించకూడదు. కార్యాలయాల్లో విధులు నిర్వహించే వారు కళ్ల కలక బారినపడితే రెండు లేదా మూడు రోజులు సెలవు పెట్టడం మంచిదన్నారు. కళ్ల కలక బాధితుల దగ్గరకు చిన్నారులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి నయమయ్యే వరకు కాస్మోటిక్స్ వాడటంఆపేయాలి. తేలిగ్గానే నయం చేసుకోవచ్చు. కళ్ల కలక సోకిన వారు చిన్నపాటి చికిత్సతోనే వ్యాధిని నయం చేసుకోవచ్చునని ఆయన అన్నారు . ఎక్కువగా మం దులు వాడాల్సిన పని ఉండదన్నారు . కళ్లను శుభ్రంగా కడుక్కోవడంతో పాటు లూబ్రికేషన్ డ్రాప్స్ లేదా యాంటీబయోటిక్ చుక్కల మందు లేదా అయోడిన్ డ్రాప్స్, ఆయిట్మెంట్లను వైద్యులను సంప్రదించి మాత్రమే వాడాలని సూచించారు . కళ్ల జోడు పెట్టుకుంటే ఇతరు లకు వైరస్ వ్యాప్తి చెందకుండా ఉంటుందని తెలిపారు . తగిన జాగ్రత్తలు పాటిస్తే రెండు మూడు రోజుల్లో ఎ వ్యాధి , తగ్గిపోతుందన్నారు .






EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190